సాక్షి పెద్దపల్లి

శనివారం । 6 । జూలై । 2024

ధర్మారం మార్కెట్ చైర్మన్‌గా రూప్లానాయక్



ధర్మారం(ధర్మపురి): ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బంజేరుపల్లి గ్రామానికి చెందిన లావుడ్య రూప్లానాయక్‌ను నియమిస్తూ ఏపీసీ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం రూప్లానాయక్‌కు నియామకపత్రం అందించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా మేడారం గ్రామానికి చెందిన అరిగే లింగయ్య, డైరెక్టర్లుగా కొంగ భూమయ్య, అవుల శ్రీనివాస్, ఈదుల శ్రీనివాస్, జనగామ తిరుపతి, గందం మహిపాల్, కోల శ్రీనివాస్, ఆల్వాల రాజేశం, వడ్లకొండ సుమతి, బద్దం గంగారెడ్డి, కాంపెల్లి రాజేశం, ఎలగందుల అశోక్, యంసాని మహేశ్‌ను నియమించారు.

న్యూస్‌రీల్

డయేరియా నియంత్రణపై ప్రచారం



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో డయేరియా నియంత్రణపై విస్తృతంగా ప్రచారం చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో సమావేశమై వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై సూచనలిచ్చారు. ఆగస్టు చివరి వరకు డయేరియా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 62,700మంది ఉన్నారని, వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, డయేరియాతో బాధపడే వారికి జింక్ టాబ్లెట్లు అందుబాటులో ఉంచామని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ తెలిపారు. జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ రమాకాంత్, డీఆర్డీవో రవీందర్, డీపీవో ఆశాలత, కృపాబాయి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కూల్చివేతలు



జేసీబీతో క్వార్టర్లు కూల్చివేస్తున్న అధికారులు

గోదావరిఖని: రోడ్డు విస్తరణలో భాగంగా సింగరేణి యాజమాన్యం శుక్రవారం మరోరెండు క్వార్టర్లను కూల్చివేసింది. స్థానిక శివాజీనగర్‌లోని రెండు క్వార్టర్లను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, కొన్నేళ్లుగా సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటూ ఉద్యోగ విరమణ చేసిన, ఇతర కారణాలతో ఉద్యోగం నుంచి తొలగించిన వారు కంపెనీకి అప్పగించకుండా అందులోనే నివాసం ఉంటున్నారని అధికారులు అన్నారు. క్వార్టర్లకు తాళాలు వేసి ఉంచుతున్నారని, ఆ క్వార్టర్లను శిథిలావస్థకు చేరినవిగా గుర్తించనున్నట్లు వెల్లడించారు. సంస్థ నిబంధనలకు విరుద్ధంగా నివాసం ఉంటున్న వారు వెంటనే క్వార్టర్లు ఖాళీ చేసి సంస్థకు అప్పగించాలన్నారు. లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

అభివృద్ధి పనులు భేష్



పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో రవీందర్

ఎలిగేడు(పెద్దపల్లి): అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన వసతుల కల్పన బాగుందని డీఆర్‌డీవో రవీందర్ అన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో శివపల్లి, నర్సాపూర్, సుల్తాన్‌పూర్ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం రవీందర్ తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, వేగవంతంగా పనులు చేయడం మహిళల ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమన్నారు. అనంతరం ఎలిగేడులోని మహిళా సంఘాల కుట్టుమిషన్ కేంద్రంలో యూనిఫామ్స్ పరిశీలించారు. పంచాయతీరాజ్ ఈఈ గిరీశ్‌బాబు, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ జగదీశ్, ఐకేపీ ఏపీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

14న బీఎంఎస్ మహాసభలు

గోదావరిఖని: మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా నస్పూర్‌కాలనీలో ఈనెల 14న సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) ద్వైవార్షిక మహా సభలు నిర్వహిస్తామని ఆ సంఘం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో అవినీతి, అక్రమాలు, నిధుల మళ్లింపుపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సొంతింటి పథకం అమలు చేయాలన్నారు. కోలిండియా మాదిరిగా కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గని ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి సూటబుల్ ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి వైద్య కళాశాలలో 80శాతం సీట్లు కార్మికుల పిల్లలకు కేటాయించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకుడు ఆకుల హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీవో సరెండర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మంథని డీఎల్‌పీవో శంకర్ సంతృప్తికరంగా విధులు నిర్వర్తించడం లేదని పేర్కొంటూ పంచాయతీరాజ్, డీఆర్డీఏ రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీచేశారు. మంథని డీఎల్‌పీవోగా అదనపు బాధ్యతలను పెద్దపల్లి డీఎల్‌పీవో వేణుగోపాల్‌కు అప్పగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆటాడుకుంటున్నారు..

- జోరుగా బెట్టింగ్ యాప్స్
- సామాజిక మాధ్యమాల్లో లింక్‌లు
- ఆడే విధానంపై వీడియోల్లో వివరణ
- జోరుగా సాగుతున్న ఆన్‌లైన్ దందా
- రూ.లక్షల్లో మోసపోతున్న యువత
- సుల్తానాబాద్ ఘటనలో 'ఖని' యువకులు



గోదావరిఖని: బెట్టింగ్ యాప్ దందాతో ముఠాలు పేట్రేగిపోతున్నాయి. వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, టెలిగ్రామ్ వేదికలుగా చేసుకుని బెట్టింగ్‌లు నిర్వహిస్తూ రూ.లక్షల్లో ఆర్జిస్తున్నాయి. కంప్యూటర్‌లో తమకున్న పరిజ్ఞానాన్ని వినియోగించి యాప్‌ల లింక్‌లను ఇతరులకు పంపిస్తూ దందా కొనసాగిస్తున్నాయి. రూ.కోట్లు కొల్లగొడుతున్నాయి. అమాయకులు యాప్‌లోకి వచ్చేలా పోత్సహించే వీడియోలు తయారు చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువగా సంపాదించాలనే ఆశతో చాలామంది ఆన్‌లైన్ గేమ్‌ల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇలాంటి వారి ఆశలను ఆసరాగా చేసుకుంటున్న కొన్ని ముఠాలు.. ఆన్‌లైన్ గేమ్‌ల పేరిట అక్రమంగా ఆర్జిస్తున్నాయి. ఇలాంటి ఓ ముఠాను జిల్లాలోని సుల్తానాబాద్ పోలీసులు పట్టుకోవడంతో ఈవిషయం వెలుగులోకి వచ్చింది. వీరిలో ముగ్గురు యువకులు ఉండగా.. అందులో ఇద్దరూ గోదావరిఖని వాసులు కావడం చర్చనీయాంశంగా మారింది.

స్మార్ట్‌ఫోన్‌ల ఆధారంగా..

- ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో ప్రపంచమే కుగ్రామంగా మారిపోయింది.
- ప్రపంచమే అరచేతిలోకి వచ్చి చేరింది. స్మార్ట్‌ఫోన్లలో ఇదంతా క్షణాల్లో చేరుతోంది.
- ఇదేసమయంలో ఆన్‌లైన్ గేమ్‌లు కుటుంబాలను ఆర్థికంగా చిన్నాభిన్నం చేస్తున్నాయి.
- ఫోన్‌పే, గూగుల్‌పే, ఆన్‌లైన్ బ్యాంకింగ్.. ఇలా అన్ని నగదు రహిత లావాదేవీలు మొబైల్ ఫోన్లలోనే సాగుతున్నాయి.
- బ్యాంకులకు వెళ్లే పనిలేకుండానే ప్రతీఒక్కరు డిజిటల్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.
- ప్రపంచంలోనే అనేక లావాదేవీలకు స్మార్ట్‌ఫోన్‌లు వేదికగా నిలుస్తున్నాయి.
- వీటిని ఆసరాగా చేసుకున్న కొన్ని ముఠాలు.. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తూ గేమ్ యాప్‌లను ఇతరులకు పంపిస్తూ అక్రమంగా ఆర్జిస్తున్నాయి.

పోలీసులకు పట్టుబడిన యువకులు

రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని సుల్తానాబాద్ పోలీసులు ఆన్‌లైన్ గేమ్‌లు నిర్వహించే ముగ్గురు యువకులను శుక్రవారం పట్టుకున్నారు. ఇందులో గోదావరిఖని ప్రాంతానికి చెందిన ఇద్దరు, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకేంద్రానికి చెందిన మరో యువకుడు ఉన్నారు. వీరు ముగ్గురు కలిసి ముఠాగా ఏర్పడి ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లు నిర్వహిస్తున్నారు. గేమ్ యాప్ లింక్‌లను పంపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. గేమ్‌లో చేరిన ప్రతీఒక్కరి నుంచి డబ్బు వచ్చి చేరుతుండడంతో రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో రూ.33లక్షల నగదుతో హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి కారులో వస్తుండగా ఈ ముగ్గురు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. ఇద్దరి వద్ద పెద్దమొత్తంలో డబ్బు పట్టుబడంతో పూర్వపరాలు విచారిస్తే ఆన్‌లైన్ గేమ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

ప్లేస్టోర్‌లో లేనియాప్‌ల లింక్‌లు

ప్లేస్టోర్‌లో లేనికొన్ని బెట్టింగ్ యాప్‌ల లింక్‌లను ముఠా సభ్యులు సామాజిక మాధ్యమాల ద్వారా పంపిస్తున్నారు. వీటికి సంబంధించిన వీడియోలను తయారుచేసి వారికి గేమ్‌ల గురించి వివరిస్తూ అందులో చేరేలా పోత్సహిస్తున్నారు. ముందుగా గేమ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని బ్యాంక్ అకౌంట్ యాడ్ చేసి, వ్యాలెట్‌లో డబ్బులు పంపించి గేమ్‌లు ఆడుతున్నారు. ముఖ్యంగా 52 క్లబ్ గేమ్‌లు ఎక్కువగా ఆడిస్తున్నట్లుగా తెలుస్తోంది. స్మాల్‌గేమ్, బిగ్‌గేమ్.. ఇలా రకరకాలుగా ఎంచుకుని పలువురిని యాప్‌లోకి రప్పిస్తున్నారు.

పోలీసుల దర్యాప్తు

ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా ప్రజలను మోసం చేస్తున్న ముఠా వెనకాల ఉన్నవారిపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అసలు ఆటకు సంబంధించి యాప్‌లు ఎక్కడ నుంచి వస్తున్నాయి? ఇందులో ఎవరివాటా ఎంత? ప్రస్తుతం పోలీసులకు చిక్కినవారి వాటా ఎంత? వీరి వెనకాల ఎవరెవరు ఉన్నారనే దానిపై పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు తీసుకుంటున్న యువత

ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, యాప్ లోన్లతో యువత అప్పులపాలై తనువు చాలిస్తున్నారు. ఇటీవల ఇలాంటి సంఘటనలు జిల్లాలో అనేకం జరిగాయి. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చిన ఆన్‌లైన్ లింక్‌లను యువత ఓపెన్‌చేసి రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్న సంఘటనలు చాలా ఉన్నాయి.

పోలీసుల అదుపులో ముగ్గురు



స్వాధీనం చేసుకున్న నగదు

గోదావరిఖని/సుల్తానాబాద్ రూరల్: బెట్టింగ్ యాప్‌లు నిర్వహిస్తూ ప్రజలను మోసగిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. సుల్తానాబాద్ బస్టాండ్ సమీపంలో ఎస్సైలు శ్రావణ్‌కుమార్, నరేశ్‌లు వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.33.10లక్షల నగదు లభించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం కేశవరాముని పాలేనికి చెందిన నిమ్మ ధనుంజయ్, గోదావరిఖని ఫైవింక్లయిన్‌కు చెందిన ముల్కల రాజ్‌కుమార్, జీఎం కాలనీకి చెందిన చిన్నపల్లి అభిలాష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

కార్మికోద్యమం



పెద్దపల్లిరూరల్: బొగ్గు గనుల ప్రైవేటీకరణ యోచనను విరమించుకుని సింగరేణి సంస్థకే కేటాయించాలనే డిమాండ్‌తో సీపీఎం, సీపీఐ, న్యూడెమొక్రసీ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, హెచ్ఎంఎస్, టీఎస్టీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ముత్యంరావు, మహేశ్వరి, సదానందం, మహేశ్వరి, సీపెల్లి రవీందర్, కల్లెపల్లి అశోక్, ప్రశాంత్, సందీప్, బాలసాని లెనిన్, కుమారస్వామి, శ్రీనివాస్, భిక్షపతి, కొమురయ్య, విజయ్‌కుమార్, ఖాజా, నాగమణి, ఎల్లయ్య, విశ్వనాథం, అశోక్, రమేశ్, కడారి సునీల్, వైవీరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల నిరసన గళం



పెద్దపల్లిరూరల్: గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6వేల పింఛన్ వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో దివ్యాంగులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు చిలారపు పర్వతాలు, రాజేందర్, అమిన్‌బేగ్, మల్లీశ్వరి, వివేక్, రమేశ్, రామ్మూర్తి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

'సత్యాగ్రహం'



పెద్దపల్లిరూరల్: రెండు లక్షల ఉద్యోగాలిస్తామనే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా విద్యావంతులైన యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష విమర్శించారు. యువతకు ఉద్యోగాలివ్వాలనే డిమాండ్‌తో ఆందోళనకు సిద్ధమైన ఉషను పోలీసులు శుక్రవారం గృహనిర్బంధం చేశారు. దీంతో ఆమె తన నివాసంలోనే శాంతియుతంగా సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. మాదిగ శక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ మద్దతు తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుదాం

- ప్రజలు, అధికారులు సహకరించండి
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



పర్యటనలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మేయర్ అనిల్

గోదావరిఖని/కోల్‌సిటీ(రామగుండం): రామగుండాన్ని సుందరమైన పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దడానికి ప్రజలు, అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. స్థానిక 26వ డివిజన్‌లో శుక్రవారం డివిజన్ సందర్శన చేపట్టారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్ మంచికట్ల దయాకర్‌తో కలిసి అడ్డగుంటపల్లి, సాధననగర్, దుర్గానగర్, మార్కండేయకాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. కాలువలు, రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు సూచించారు. వీధులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్లు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడవేస్తే జరిమానా విధించాలని కోరారు. జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో రోడ్లు, కాలువలు శుభ్రం చేయాలని చెప్పారు. ఖాళీ స్థలాల్లోని ముళ్లచెట్లు, పొదలు తొలగించాలని ఆయన పేర్కొన్నారు. నగరానికి తలమానికంగా ఉన్న 26వ డివిజన్‌లో దశల వారీగా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత మార్కండేయకాలనీలో సభ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వన మహోత్సవం సందర్భంగా మొక్కలు పంపిణీ చేశారు. కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, ముస్తాఫా, కో ఆప్షన్ సభ్యుడు చెరుకు బుచ్చిరెడ్డి, తహసీల్దార్ కుమారస్వామి, అధికారులు రామన్, మీర్, శంకర్‌రావు, కరుణాకర్, అభినవ్, రాంజీ, ట్రాన్స్‌కో ఏఈ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతకు శిక్షణ

గోదావరిఖని: వోల్వో డంప్‌ట్రక్ ఆపరేటర్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సింగరేణి పరిసర, ప్రభావిత గ్రామాల నిరుద్యోగ యువకులకు వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్‌గా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పాసై, హెవీ గూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, మూడేళ్ల అనుభవం ఉన్న వారు అర్హులన్నారు. 18 – 35 ఏళ్ల వయసు గలవారు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేయాలని ఆయన కోరారు. ఈనెల 15 నుంచి శిక్షణ ఇస్తామని ఆయన వివరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత

- జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్



గడ్డర్లను పరిశీలిస్తున్న పుట్ట మధూకర్, ముత్తయ్య

ముత్తారం(మంథని): కాంగ్రెస్ ప్రభుత్వం అప్రమత్తంగా లేకనే ఓడేడు మానేరు వంతెన గడ్డర్లు కుప్ప కూలాయని జెడ్పీ మాజీచైర్మన్ పుట్ట మధూకర్ ఆరోపించారు. మానేరులో కూలిన వంతెన గడ్డర్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రజల రవాణా కోసం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే హోదాలో తాను ఓడేడు –గర్మిళ్లపల్లి మధ్య మానేరుపై వంతెన నిర్మించాలని ప్రతిపాదించానని గుర్తుచేశారు. దీంతో రూ.47.7కోట్లు మంజూరు కాగా 2016లో పనులు ప్రారంభించారని, 3శాతం లెస్‌తో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అలసత్వంతో పనుల్లో జాప్యం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏప్రిల్ 22న మూడు గడ్డర్లు కూలాయని, అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి శ్రీధర్‌బాబు వాటిని పరిశీలించారని, అధికారులు అప్పుడే అప్రమత్తం చేసిఉంటే మళ్లీ ఐదు గడ్డర్లు కూలేవి కాదని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రూ.కోట్ల ఆస్తి నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. పోలీసులు బీఆర్ఎస్ నాయకుల ముఖం చూడడం లేదని, కనీసం దరఖాస్తు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, నాయకులు నూనె కుమార్, రాజిరెడ్డి, రవీందర్‌రావు, ఇల్లందుల అశోక్, షేరు స్వామి, నరేడ్ల రమేశ్, గాదం శ్రీను, అలువోజ్ రవీందర్ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని విద్యార్థుల నుంచి ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభాపాటవాలను వెలికితీసేందుకు కేంద్రప్రభుత్వం ఏటా ఇన్‌స్పైర్ అవార్డు మనాక్ పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఈసారి కూడా వినూత్నరీతిలో ఆవిష్కరణలు, ప్రాజెక్టులను రూపొందించినవారు ఈనెల 15లోగా నమోదు చేసుకోవాలని కోరారు. ఆరు నుంచి పదో వతగరగతి వరకు చదివే విద్యార్థులు తమ వ్యక్తిగత, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డులతోపాటు ప్రాజెక్టు వివరాలను నమోదు చేయాలన్నారు. అవార్డుకు ఎంపికైతే రూ.10వేల పారితోషికం, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిస్తే రూ.25వేల పారితోషికం అందిస్తారన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, 99515 04622 నంబరులో సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్సీ చేరిక వ్యూహాత్మకమే..

- కాంగ్రెస్ కండువా కప్పుకున్న తానిపర్తి భానుప్రసాద్‌రావు



కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్న ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

సాక్షి, పెద్దపల్లి: ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్‌కు షాక్ తగిలినట్లయింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు చాలామంది గులాబీ కండువా పక్కన పడేసి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. గులాబీ జెండా నీడన ఉన్న నాయకులు వలస బాట పట్టడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఈటల రాజేందర్‌ను నియమిస్తే.. బీఆర్ఎస్‌లోని ఇద్దరు కీలక నేతలు కూడా కాషాయ కండువా కప్పుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు, నాయకులు, అధికార కాంగ్రెస్ వైపు అడుగులు వేయగా, మరికొందరు పార్టీ మారేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. తాము పార్టీని వీడాలనే యోచనలో ఉన్నామనే విషయాన్ని స్థానిక నాయకత్వానికి చెప్పినా పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో చాలామంది కాంగ్రెస్, బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు.

అసెంబ్లీ ఫలితాల నుంచే..

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందిన నాటి నుంచే ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు గులాబీ నేతలు, కార్యక్రమాలతో అంటీముట్టనట్లుగా ప్రవర్తిస్తూ వచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయలేదు. ఒకసారి మంత్రి శ్రీధర్‌బాబు సభలో పాల్గొన్నారు. అంతేకాదు.. 'తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. నేను ఆశావహుడిని. మన ప్రాంతానికి చెందిన శ్రీధర్‌బాబు సీఎం అవుతారనే ఆశ ఉండే. ఇప్పుడు కాకపోయినా ఎప్పటికైనా ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఎవరికైనా ఉందంటే అది శ్రీధర్‌బాబుకి మాత్రమే.. ఆయన సీఎం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటన్నా' అని భానుప్రసాద్‌రావు వ్యాఖ్యానించడంతో ఆయన పార్టీ మారడం ఖాయమనే ప్రచారం అప్పట్లోనే జరిగింది.

వరుసగా మూడుసార్లు ఎమ్మెల్సీగా..

ఎలిగేడు మండలం లోకపేటకు చెందిన తానిపర్తి భానుప్రసాద్‌రావు 2009లో కాంగ్రెస్ ద్వారా రాజకీయ అరంగేట్రం చేశారు. తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009 మే 2న ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2014 జూన్ 6 వరకు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2015 జూన్ 2 వరకు ఎమ్మెల్సీగా పనిచేశారు. తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్‌లో చేరారు. 2016 జనవరి 1న రెండోసారి ఎన్నికై 2022 జనవరి 4 వరకు కొనసాగారు. 2019 సెప్టెంబర్ 7 నుంచి శాసన మండలిలో విప్‌గా ఉన్నారు. 2022 జనవరి 6న మూడోసారి ఎన్నికైన ఆయన.. చీఫ్ విప్‌గా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఒడిశా రాష్ట్ర పరిశీలకుడిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ మైనారిటీ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో కొనసాగారు. మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, లైబ్రరీస్ కమిటీల్లో కొనసాగారు.

కాంగ్రెస్ ఆకర్ష్ తో..

జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం బల్దియాల్లో మినహా ఎక్కడా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు లేరు.

- రామగుండం కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా.. బీఆర్ఎస్ నుంచి 18 మంది, కాంగ్రెస్ నుంచి 11 మంది, బీజేపీ నుంచి ఆరుగురు, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి 9 మంది, స్వతంత్రులు ఆరుగురు విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మేయర్ అనిల్‌కుమార్‌తో సహా 16 మంది కాంగ్రెస్‌లో చేరారు. మరికొందరు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నా.. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా ప్రచారం చేశారనే కారణంతో పార్టీలోకి తీసుకునేదిలేదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ స్పష్టం చేశారు. దీంతో పలువురు బీజేపీ వైపుచూస్తున్నారు.
- మంథని బల్దియాలో 13 స్థానాలకు కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి 11 గెలిచారు. ఇందులో ఏడుగురు కాంగ్రెస్‌లో ఏరడంతో చైర్‌పర్సన్ పుట్ట శైలజపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి రమను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. మరో నలుగురు మంత్రి శ్రీధర్‌బాబు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు.
- సుల్తానాబాద్‌లో 15వార్డులకు కాంగ్రెస్ నుంచి ఆరుగురు, బీఆర్ఎస్ నుంచి 9 మంది గెలిచారు. ముత్యం సునీత చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ నుంచి ఇద్దరు కాంగ్రెస్‌లో చేరడంతో పర్యవసానంగా చైర్‌పర్సన్‌గా గాజుల లక్ష్మి ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే గ్రీన్‌సిగ్నల్ ఇస్తే మరో ఇద్దరు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు.
- పెద్దపల్లిలో బల్దియాలో 36 వార్డులు ఉండగా, బీఆర్ఎస్ నుంచి 24 మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, ఇతరులు ముగ్గురు, బీజేపీ నుంచి ఇద్దరు, ఎంఐఎం నుంచి ఇద్దరు కౌన్సిలర్లుగా గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్ నుంచి 8మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 19మంది, కాంగ్రెస్‌కు 13 మంది, బీజేపీకి ఒకరు, బీఎస్పీకి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు.

క్లుప్తంగా

సాగర్ వైద్యానికి ఆర్థిక చేయూత

సాక్షి ఎఫెక్ట్


సాగర్‌కు ఆర్థికసాయం అందిస్తున్న సంజన

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని ఓరుగంటి సాగర్ వైద్యానికి తన తండ్రి గణేశ్ జ్ఞాపకార్థం ప్రతినెలా రూ.2 వేల ఆర్థిక సాయం అందించేందుకు కుమ్మరిపల్లికి చెందిన దూకంటి రాజశేఖర్ ముందుకువచ్చారు. ఈ మేరకు అతని భార్య సంజన శుక్రవారం రూ.2 వేలు అందించారు. ఇటిక్యాలకు చెందిన కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి(ఆస్ట్రేలియా) అనే ఎన్‌ఆర్‌ఐ రెండు నెలలపాటు వైద్యానికి సరిపడా రూ.12 వేలను సాగర్‌కు ఫోన్‌పే ద్వారా పంపించారు. ఈ నెల 4న పాడైన కిడ్నీలు.. పనిచేయని చేయి శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వీరు స్పందించి, సాయం చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు, స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

తండ్రికి గుడి కట్టించిన తనయుడు



కథలాపూర్(వేములవాడ): ఓ వ్యక్తి తన తండ్రికి గుడి కట్టించి, అందులో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. వివరాల్లోకి వెళ్తే.. కథలాపూర్ మండలంలోని చింతకుంటకు చెందిన అంబల్ల లింబాద్రి ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన బీడీ కమిషన్ ఏజెంట్‌గా గ్రామంలో అందరికీ సుపరిచతుడు. లింబాద్రి కుమారుడు శ్రీనివాస్ రూ.3 లక్షలతో తండ్రి విగ్రహాన్ని తయారు చేయించి, గ్రామ శివారులో గుడి కట్టించాడు. శుక్రవారం గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించాడు. తండ్రిపై మమకారంతో గుడి కట్టించిన శ్రీనివాస్‌ను స్థానికులు అభినందించారు.

ఎల్లమ్మ తల్లి ఆలయంలో చోరీ



తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ఎల్లమ్మ తల్లి ఆలయంలో చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఆలయంలో చొరబడి, మూడు గ్రాముల పుస్తెలు, రెండు గ్రాముల వెండి కళ్లు, హుండీలోని నగదు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఆలయానికి చేరుకొని, పరిశీలించారు. ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్స్ నిపుణులతో ఆధారాలు సేకరించారు. గౌడ సంఘం అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రామగుండం: అంతర్గాం మండలంలోని కుందనపల్లి ఐవోసీఎల్ డిపో సమీపంలో శుక్రవారం పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకట్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,920, నాలుగు బైక్‌లు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్లకు 'ఆసరా'



ఈమె ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన అరుణ. భర్త పేరు రాజగోపాల్. సిరిసిల్ల సబ్‌ట్రెజరీ ఆఫీస్ ద్వారా పెన్షన్ ఐడీ నంబరు(పీపీవో 15022672) పీపీవో నంబరు 03–ఎఫ్‌జీ–002815 ద్వారా ప్రభుత్వ సర్వీసు పెన్షన్‌ను బ్యాంకు ద్వారా పొందుతున్నారు. ఇది కాకుండా బీడీ కార్మికురాలిగా నమోదు చేసుకుని ప్రభుత్వం ద్వారా ఆసరా పెన్షన్‌ను రూ.2,016 ప్రతి నెలా పొందుతున్నారు. ఇలా ఇప్పటి వరకు అరుణ రూ.1,68,928 పొందారు. ఈమె ఒక్కరే కాదు.. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 71 మంది ఇలా ప్రభుత్వ సర్వీసు పెన్షన్ పొందుతూ.. మరోవైపు పేదలకు దక్కాల్సిన ఆసరా పెన్షన్ సైతం తీసుకుంటున్నారు.



ఈమె రుద్రంగి మండల కేంద్రానికి చెందిన సుల్తాన్ శాంత (49). ఈమె భర్త దుర్గయ్య మరణించాడు. ఈమెకు 2022 ఆగస్టులో వితంతు పెన్షన్ మంజూరుకాగా.. స్థానిక ఎంపీడీవో మంజూరుపత్రాన్ని అందించారు. కానీ శాంతకు ఏడాదిన్నరగా ఒక్క పైసా పెన్షన్ డబ్బులు అందలేదు. కూలి పనిచేస్తూ పొట్టపోసుకుంటుంది. వితంతు పెన్షన్ కోసం ఆశగా ఎదురుచూస్తుంది.



చంకలో బాబుతో దీనంగా చూస్తున్న ఈమె ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన దినసరి కూలి ఆకారం రాజేశ్వరి. ఈమె పెద్దకొడుకు భరత్ మానసిక వికలాంగుడు. 2022 నవంబరులో భరత్ పేరుతో సదరం సర్టిఫికెట్ జారీ అయింది. పెన్షన్ పొందేందుకు బాబుకు అన్ని అర్హతలున్నాయి. ఆన్‌లైన్‌లో పెన్షన్ కోసం దరఖాస్తు చేశారు. కానీ ఇప్పటి వరకు భరత్‌కు ఆసరా దక్కలేదు. ఆసరా పెన్షన్ కోసం ఆ పేదకుటుంబం ఆశగా నిరీక్షిస్తుంది.

- రాజన్నసిరిసిల్ల జిల్లాలో 71 మందికి రెండు పింఛన్లు
- గుర్తించని యంత్రాంగం
- రూ.57.75 లక్షలు పక్కదారి
- రికవరీకి తంటాలు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 71 మంది ప్రభుత్వ సర్వీసు పెన్షనర్లు ఏళ్లుగా ఆసరా పెన్షన్ పొందుతున్నారు. వీరంతా ఇప్పటి వరకు రూ.57.75 లక్షల ప్రజాధనాన్ని అక్రమంగా పొందారు. అటు ప్రభుత్వ పెన్షన్ పొందుతూ.. ఇటు ఆసరా పెన్షన్ పొందుతున్న వీరిని గుర్తించడంలో యంత్రాంగం విఫలమైంది. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఇతర ప్రభుత్వ సిబ్బంది ఉన్నా రెండు పెన్షన్లు పొందుతున్నా గుర్తించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా డబుల్ పెన్షన్లు పొందుతున్న 71 మంది నుంచి ఆసరా పెన్షన్ సొమ్ములను రికవరీ చేయడం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. వీరి సర్వీసు పెన్షన్‌ను ఆపివేసి, వారి నుంచి ఆసరా పెన్షన్ రికవరీ చేయాలని భావిస్తున్నారు. ఒక్కరికి రెండు పెన్షన్లు ఇచ్చి.. అర్హులకు మొండిచెయ్యి చూపడం అన్యాయం.


వేములవాడ సబ్ ట్రెజరీ ఆఫీస్

జిల్లాలో ఆసరా పెన్షన్ల వివరాలు

వృద్ధాప్య 32,831, దివ్యాంగులు 9,961, వితంతు 24,325, బీడీ కార్మికులు 43,339, నేతకార్మికులు 3,650, గీతకార్మికులు 2,313, ఒంటరి మహిళలు 1,826, పైలేరియా బాధితులు 1,003, డయాలసిస్ రోగులు 66, మొత్తం పెన్షనర్లు 1,19,786 మంది ఉన్నారు.

మా దృష్టికి రాలేదు



జిల్లాలో సర్వీసు పెన్షన్లు, ఆసరా పెన్షన్లు రెండూ పొందుతున్నట్లు మా దృష్టికి రాలేదు. ఒక్కరే రెండు పెన్షన్లు పొందుతున్నట్లు మాకు ఎలాంటి జాబితా ఇప్పటి వరకు అందలేదు. సర్వీసు పెన్షన్ల వివరాలు తెలుసుకుంటాం. అలా జరిగి ఉంటే ప్రభుత్వ ఆదేశాలతో వారి నుంచి రికవరీ చేస్తాం. ఆసరా పెన్షన్లను తొలగిస్తాం. – శేషాద్రి, డీఆర్‌డీవో

15 ఏళ్లకు.. పిల్లల చెంతకు

- భార్య మృతి కేసులో జైలుకు..
- సత్ప్రవర్తనతో విడుదలైన వెంకటేశ్వరపల్లివాసి
- అనాథాశ్రమంలో పిల్లలను చూసి, కన్నీటిపర్యంతం

జమ్మికుంట(హుజూరాబాద్): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య మృతికి కారణమయ్యాడు.. 15 ఏళ్ల జైలు జీవితం అనుభవించి, సత్ప్రవర్తనతో విడుదలయ్యాడు.. ఇన్నేళ్లు అనాథాశ్రమంలో పెరిగి, పెద్దవాళ్లయిన పిల్లలను చూసి, కన్నీటిపర్యంతమయ్యాడు జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన సోమ సారయ్య. వివరాల్లోకి వెళ్తే.. కోరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరపల్లికి చెందిన సారయ్యకు భార్య సత్తమ్మ, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబ కలహాలతో 2010లో అతను తన భార్య మృతికి కారణమయ్యాడు. జమ్మికుంట అప్పటి సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు పూర్తి చేయగా కోర్టు సారయ్యకు యావజీవ కారాగార శిక్ష విధించింది. అతని ఆరేళ్ల కూతురు, నాలుగేళ్ల కుమారుడిని సీఐ కొత్తపల్లిలోని స్పందన అనాథాశ్రమంలో చేర్పించి, జాగ్రత్తగా చూసుకోవాలని నిర్వాహకుడు గోపరాజు వీరస్వామికి సూచించారు. కాగా, జైలుశిక్ష అనుభవిస్తున్న సారయ్య సత్ప్రవర్తన కారణంగా ఈ నెల 3న జైలు నుంచి విడుదలయ్యాడు. అతని కూతురు ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. కుమారుడు ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. సారయ్య శుక్రవారం తన పిల్లలున్న ఆశ్రమానికి వెళ్లాడు. వారిని చూసి, కన్నీటి పర్యంతమయ్యాడు. ఆశ్రమ నిర్వాహకులు వారిని తండ్రికి అప్పగించారు.


పిల్లలను అప్పగిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

ఇల్లు ఇచ్చి, ఉపాధి చూపాలి



నేను రిమాండ్‌లో ఉన్న సమయంలో నా పిల్లలను ఎవరికీ అప్పగించవద్దని సీఐ శ్రీనివాసరావును ప్రాధేయపడ్డాను. ఆయన వారిని స్పందన అనాథాశ్రమంలో చేర్పించారు. ఇప్పుడు జైలు నుంచి విడుదలయ్యాను. ఇక నా జీవితాన్ని నా పిల్లలతో గడపాలని వారిని తీసుకెళ్తున్నాను. సీఎం రేవంత్‌రెడ్డి నాకు ఇల్లు ఇచ్చి, ఉపాధి చూపాలని కోరుకుంటున్నాను. – సోమ సారయ్య, వెంకటేశ్వరపల్లి

కన్న బిడ్డల్లా చూసుకున్నాం



జమ్మికుంట అప్పటి సీఐ శ్రీనివాసరావు సారయ్య పిల్లలను మాకు అప్పగించారు. 15 ఏళ్లుగా వారిని మా కన్న బిడ్డల్లా చూసుకున్నాం. ఏం తెలియని వయసులో మా ఆశ్రమానికి వచ్చినవారు చదువుకొని, పెద్దవాళ్లయి, వెళ్లిపోతుంటే మనసుకు చాలా బాధగా ఉంది. తండ్రి భవిష్యత్తులో ఆ పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నాం. – గోపరాజు వీరస్వామి, స్పందన అనాథాశ్రమ నిర్వాహకుడు, కొత్తపల్లి

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య


ప్రవళిక (ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలంలోని రేచపల్లికి చెందిన బద్దం ప్రవళిక(38)కు పదేళ్ల క్రితం లక్షెట్టిపేటకు చెందిన పీసు రవీందర్‌రెడ్డితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. పెళ్లి తర్వాత రవీందర్‌రెడ్డి రేచపల్లిలోని అత్తారింట్లోనే ఉంటూ గ్రామంలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ప్రవళిక గ్రామంలోని సెర్ప్(ఐకేపీ) బుక్ కీపర్‌గా, సారంగాపూర్ పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో సీజన్ సమయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తోంది. ఇటీవల గ్రామానికో మీసేవ కేంద్రాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రేచపల్లిలో సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంది. ఇందుకోసం రూ.1.50 లక్షలు వెచ్చించి, ల్యాప్‌టాప్ కూడా కొనుగోలు చేసింది. రోజురోజుకూ ఆర్థిక ఇబ్బందులు పెరగడం, తమది చాలీచాలని సంపాదనతో అంటూ తన సంబంధీకులతో చెబుతూ బాధపడేది. ఈ క్రమంలో గురువారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి, నిద్రించింది. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకుంది. ఉదయం చూసి, ప్రవళిక మృతిచెందిన విషయాన్ని గుర్తించిన భర్త పోలీసులకు సమాచారం అందించాడు. ఆమె తల్లి బద్దం మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ప్రవళిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేరుకొని, మృతురాలి కుటుంబసభ్యులను ఓదార్చారు.

రైలెక్కుతూ కిందపడి వ్యక్తి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): రైలెక్కుతూ.. ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని మాచనపల్లికి చెందిన బండి శ్రీనివాస్(44) శుక్రవారం మంచిర్యాలలోని తన సోదరి ఇంటికి బయలుదేరాడు. జమ్మికుంటలో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలెక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి, కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన రైల్వేస్టేషన్ సిబ్బంది 108 వాహనంలో హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

పోక్సో కేసులో నేరస్తుడికి మూడేళ్ల జైలు

కరీంనగర్ క్రైం: పోక్సో కేసులో నేరస్తుడికి కరీంనగర్ పోక్సో కోర్టు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలానికి చెందిన గుంటుక రమేశ్ అలియాస్ జేరిపోతుల రమేశ్ అనే యువకుడు ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు ఆమెను లైంగికంగా వేధింపులకు గురిచేశాడు. కేసు దర్యాప్తు చేసిన కరీంనగర్ టూటౌన్ పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. శుక్రవారం సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో అతనికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

విద్యార్థిని బలవన్మరణం

చందుర్తి(వేములవాడ): మండలంలోని కొత్తపేటకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఊరడి మహేశ్వరి16) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధ పడుతోంది. శుక్రవారం ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి లోపల దూలానికి ఉరేసుకుంది. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. మృతురాలి తండ్రి వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండల కేంద్రంలో గురువారం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా స్థానికుడైన కుంటాల శేఖర్ మద్యం సేవించి, బైక్‌పై వచ్చి, ఎస్సైతోపాటు పోలీస్ సిబ్బందిని దుర్భాషలాడాడు. విధులకు ఆటంకం కలిగించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. శుక్రవారం అతన్ని అరెస్టు చేశామని తెలిపారు.

ఏబీవీపీ నాయకుడిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లబొప్పాపూర్‌కు చెందిన ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. నిరుద్యోగులు చేపట్టిన టీజీపీఎస్సీ ముట్టడికి హైదరాబాద్ వెళ్తుండగా రాచర్లగొల్లపల్లి బస్టాండ్‌లో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. భారత న్యాయ సంహిత కింద అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

స్కూల్ వ్యాన్, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

వేములవాడరూరల్: స్కూల్ వ్యాన్, బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు. వేములవాడ నుంచి ఎన్గల్‌కు వెళ్తున్న స్కూల్ వ్యాన్ ఎదురుగా వస్తున్న బైక్ హనుమాజీపేట వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న కొమ్ము రాజయ్య, లచ్చిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మారుతి తెలిపారు.

మహిళ అదృశ్యం


లావణ్య

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై అశోక్ తెలిపారు. బోదాసు లావణ్య ఈ నెల 3 నుంచి కనబడటం లేదని తండ్రి గొల్ల ఎర్ర నర్సయ్య శుక్రవారం ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాపకు జన్మనిచ్చిన బాలిక

సైదాపూర్(హుస్నాబాద్): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక పాపకు జన్మనిచ్చిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి బంధువుల వివరాల ప్రకారం.. బాలిక సైదాపూర్ మండలంలోని సోమారం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ చదువుతోంది. గత వినాయక చవితి పండుగకు ఇంటికి వచ్చినప్పుడు అదే గ్రామానికి చెందిన వరుసకు బావ అయిన రెడ్డి వెంకటేశ్ ఆమెను లొంగదీసుకున్నాడు. పాఠశాల హాస్టల్లో ఉంటున్న బాలిక 3 నెలల క్రితం వాంతులు చేసుకోవడం, ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో టీచర్లు ఇంటికి పంపించారు. గర్భం దాల్చిన విషయం బయటపడటంతో వెంకటేశ్ వల్లనేనని తల్లిదండ్రులకు చెప్పింది. వారు తమ బిడ్డను వివాహం చేసుకోవాలని అతన్ని అడుగుతూ వస్తున్నారు. ఇంతలో ఆ బాలిక ఈ నెల 1న హనుమకొండ మిషన్ ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, ఎస్సై ఆరోగ్యం తెలిపారు. కాగా, బాలిక గర్భం దాల్చడానికి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి కారణమన్న గుసగుసలు గ్రామంలో వినిపిస్తున్నాయి. వెంకటేశ్ మాత్రం తనకు ఏ పాపం తెలియదని, ఎలాంటి పరీక్షలకైనా సిద్ధమని చెబుతున్నాడు. పోలీసుల దర్యాప్తు అనంతరం నిజమేంటో తేలనుంది.

ఉద్యోగం నుంచి ప్రభుత్వ వైద్యురాలి తొలగింపు

- స్టాఫ్‌నర్స్ సస్పెన్షన్
- విధులను నిర్లక్ష్యం చేయడంతో పెద్దపల్లి కలెక్టర్ చర్యలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యురాలిని ఉద్యోగం నుంచి తొలగించారు. స్టాఫ్‌నర్స్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విధులను నిర్లక్ష్యం చేయడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కొన్ని రోజుల క్రితం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి ఓ మహిళ ప్రసూతి కోసం వచ్చింది. శస్త్రచికిత్స చేసిన వైద్యురాలు రుక్మిణి కాటన్‌ను కడుపులోనే మరిచిపోయి, కుట్లు వేశారు. ఇంటికి వెళ్లిన సదరు మహిళ కడుపునొప్పి వస్తోందంటూ మళ్లీ ఆస్పత్రికి వచ్చింది. వైద్య సిబ్బంది మందులు రాసి, పంపించారు. అయినా, నొప్పి తగ్గకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి, ఆమె కడుపులో కాటన్ ఉన్నట్లు గుర్తించి, శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. బాధితులు ఆగ్రహంతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి, ఈ వ్యవహారంపై వైద్యులను నిలదీసినట్లు తెలిసింది. వారు స్పందించకపోవడంతో కలెక్టర్ శ్రీహర్షకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వాస్తవాలు తెలుసుకొని, వైద్యురాలు రుక్మిణిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ, స్టాఫ్‌నర్స్ మాధవిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పాలకుర్తి మండలంలోని రాజాపూర్‌కు చెందిన మహిళకు గత మార్చిలో వైద్యురాలు ఆపరేషన్ చేశారని, ఆ సమయంలో కడుపులోనే కాటన్ మర్చిపోయారని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమాకాంత్ తెలిపారు. వైద్యురాలితోపాటు స్టాఫ్‌నర్స్‌పై కలెక్టర్ చర్యలు తీసుకున్నది వాస్తవమేనని శుక్రవారం పేర్కొన్నారు.

'అల్ఫోర్స్'లో ఆకట్టుకున్న మెహందీ ఉత్సవ్


మెహందీ చూపుతున్న విద్యార్థినులు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో శుక్రవారం నిర్వహించిన మెహందీ ఉత్సవ్ ఆకట్టుకుంది. ఆషాఢమాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడాన్ని ఇష్టపడతారని తెలియజేస్తూ పాఠశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తెలిపారు. గోరింటాకు శరీరంలో వేడిని తగ్గిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థినుల సంప్రదాయ దుస్తుల్లో రావడంతో పండుగ వాతావరణం నెలకొంది.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి


కుమారస్వామి ఫైల్)

కరీంనగర్‌క్రైం/జమ్మికుంట(హుజూరాబాద్): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తుమ్మల కుమారస్వామి(43) మృతిచెందారు. కడుపులో నొప్పి వస్తోందంటూ రెండు రోజుల క్రితం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయారు. 2007లో ఆయన ఏఆర్ విభాగంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి, ఇటీవలే సివిల్ కానిస్టేబుల్‌గా కన్వర్షన్ వెళ్లారు. కుమారస్వామి మృతదేహాన్ని స్వగ్రామం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. అంత్యక్రియల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్, జమ్మికుంట సీఐ రవి, ట్రాఫిక్ ఎస్సై ప్రమోద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ట్రాఫిక్ సీఐ కరీముల్లాఖాన్

ప్రభుత్వ ఆస్పత్రిలో గణేశ్‌నగర్‌వాసి..

కరీంనగర్ క్రైం: నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన తోట వెంకటేశ్వర్‌రావు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గత నెల 25న మద్యం మత్తులో క్రిమిసంహార మందు తాగాడు. కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా శుక్రవారం చనిపోయాడు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

బైండోవర్లను ఆషామాషీగా తీసుకోవద్దు

- ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్
- నిబంధనలు ఉల్లంఘించిన మహిళకు రూ.50 వేల జరిమానా

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బైండోవర్లను ఆషామాషీగా తీసుకోవద్దని ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన ఓ మహిళకు రూ.50 వేల జరిమానా విధించగా చెల్లించిందన్నారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌కు చెందిన అనసరి పోచవ్వ 2023 అక్టోబర్ 11న నాటుసారా విక్రయిస్తూ పట్టుబడింది. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి, రూ.లక్ష పూచీకత్తుతో వదిలేశారు. కానీ, బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి, 2024 మార్చి 30న తిరిగి నాటుసారా విక్రయించడంతో తహసీల్దార్ సత్యనారాయణ రూ.50 వేల జరిమానా విధించారు. ఆ మొత్తాన్ని పోచవ్వ శుక్రవారం చెల్లించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు 48 మందిని వివిధ నేరాల్లో పట్టుకొని, బైండోవర్ చేశామన్నారు. వారిలో ఇద్దరు జైలుశిక్ష అనుభవిస్తుండగా మిగతావారు రూ.లక్ష చొప్పున జరిమానా చెల్లించారని పేర్కొన్నారు. గంజాయి, గుడుంబా విక్రయించి, బైండోవర్ అయినవారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

రామడుగు(చొప్పదండి): చేయని దొంగతనానికి పోలీసులు తనను తీసుకెళ్లి, చిత్రహింసలకు గురిచేశారని రామడుగు మండలంలోని వెలిచాలకు చెందిన కుతాడి కనకయ్య ఆరోపించాడు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. రామడుగు పోలీసుల నుంచి ప్రాణభయం ఉందని, తనను హింసించిన ఎస్సై, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని కోరానని తెలిపాడు.


ఫిర్యాదు చేసిన కుతాడి కనకయ్య

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

కోరుట్ల రూరల్: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల రూరల్ మండలంలోని నాగులపేటకు చెందిన కేతిరెడ్డి మోహన్‌రెడ్డి(56) శుక్రవారం తన ద్విచక్రవాహనంపై కోరుట్ల వైపు వెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ కోరుట్ల నుంచి నాగులపేటకు వస్తోంది. సంగెం–కోరుట్ల మధ్య ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. అనంతరం రోడ్డు కిందికి దూసుకెళ్లి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మోహన్ రెడ్డి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మోహన్ రెడ్డి మృతదేహం, రోదిస్తున్న కుటుంబసభ్యులు